నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

హైదరాబాద్, బుధవారం 30 ఏప్రిల్ 2025 | RANGAREDDY


## బల్దియా కమిషనర్‌గా ఆర్‌వీ కర్ణన్ బాధ్యతల స్వీకరణ



సిటీబ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్‌వీ కర్ణన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇటీవల జరిపిన ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆర్‌వీ కర్ణన్ జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమితులయ్యారు. బదిలీపై వెళుతున్న కమిషనర్ ఇలంబర్తి నుంచి కర్ణన్ అధికారికంగా జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా సేవలందించిన ఆర్‌వీ కర్ణన్ హైజీన్ ప్రమాణాలను ఉల్లంఘించిన రెస్టారెంట్లు, పబ్‌లు, ఐస్‌క్రీమ్ పార్లర్లు వంటి ఆహార సంస్థలపై రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహించి ప్రజల్లో ఆహార భద్రతపై అవగాహన పెంచారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా కొనసాగిన ఇలంబర్తి తన పదవీ కాలంలో నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పౌర సేవల మెరుగుదలకు పలు కార్యక్రమాలను చేపట్టారు. ప్రస్తుతం ఆయన పురపాలక శాఖ కార్యదర్శి (హెచ్ఎండీఏ పరిధి)గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్, బదిలీపై వెళ్లిన ఇలంబర్తికి ఉద్యోగులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

## స్టాండింగ్ కమిటీ సమావేశంపై ఉత్కంఠ

సిటీబ్యూరో : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశంపై ఉత్కంఠ నెలకొన్నది. ఎంఐఎం, కాంగ్రెస్ సభ్యుల మధ్య మాటల తూటాలు మళ్లీ పేలే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం మళ్లీ 13 చెరువులనే పరిరక్షిస్తామని అధికారులు ప్రతిపాదనలు పెట్టారు. గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ అంశంలో మేయర్ వర్సెస్ ఎంఐఎం సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరగడం, మళ్లీ ఆ ప్రతిపాదనలతోనే స్టాండింగ్ కమిటీ ముందుకు రావడం, స్టాండింగ్ కమిటీ సమావేశంలో 8 మంది సభ్యులతో ఎంఐఎం బలంగా ఉండడంపై ఈ అంశం ఆమోదం పొందడంపై ఉత్కంఠ నెలకొన్నది. వాస్తవంగా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో 13 చెరువుల పరిరక్షణలో టెక్నికల్ కన్సల్టెంట్‌గా 'నీరి'ని నియమించుకుని చెరువుల నీటి నాణ్యతపై ఎప్పటికప్పుడు పరీక్షలు జరపడంతోపాటు ఇరిగేషన్ సమన్వయంతో సంబంధిత చెరువుల ఆక్రమణకు గురి కాకుండా పక్కాగా పరిరక్షణ చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఇందుకోసం రూ.55 లక్షల ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఐతే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఎంఐఎం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమయంలో మేయర్‌కు, ఎంఐఎం సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. చివరకు ఈ ప్రతిపాదనను కమిటీ పక్కన పెట్టింది. ఈలోగా హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక రావడం, ఫలితాలు వెలువడి కోడ్ ముగియడంతో స్టాండింగ్ కమిటీ సమావేశం ముహూర్తం కుదిరింది.

అమ్మ ఆదర్శ పాఠశాలలపై ప్రభుత్వం చిన్నచూపు

# పేరు మార్చినా.. పురోగతి శూన్యం..!

- అధికారుల ఆదేశాలతో జిల్లాలో ఎక్కడికక్కడ ఆగిపోయిన పనులు
- ఐదునెలలుగా పాఠశాలల్లోనే మగ్గుతున్న రంగులు
- ఇప్పటికే వేసిన వాటికి బిల్లులు ఇవ్వని ప్రభుత్వం
- పాఠశాలలు త్వరలో ప్రారంభమవుతున్నా వసతులపై దృష్టి సారించని సర్కారు



రంగులు వేయకపోవటంతో వెలవెలబోతున్న పాఠశాల భవనం

ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి పాఠశాలల్లో హాజరు శాతాన్ని పెంచేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు - మన బడి కార్యక్రమం కింద రంగారెడ్డి జిల్లాలోని అనేక పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దింది. కాని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మన ఊరు - మన బడి పేరును మార్చి ఇందిరమ్మ ఆదర్శ పాఠశాలలుగా నామకరణం చేసింది. కాని, చేతల్లో మాత్రం ఏమాత్రం ఆదర్శం కనిపించడంలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడి సంవత్సరన్నర కావస్తున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించడంలేదు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల అభివృద్ధితోపాటు రంగులు వేయించే కార్యక్రమం చేపట్టారు. వాటికి కూడా ఇప్పటివరకు బిల్లులు ఇవ్వడంలేదు. పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ప్రతిరోజూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నప్పటికీ వసతులు కల్పించకపోగా.. వాటికి రంగులు కూడా వేయడంలేదు. పేరు మార్చిన ప్రభుత్వం పాఠశాలల పనుల పురోగతి శూన్యమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

- రంగారెడ్డి, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో సుమారు 1300 వరకు ప్రభుత్వ పాఠశాలలుండగా.. సుమారు 1.50 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు పాఠశాలలకు రంగులు వేయడంకోసం ప్రభుత్వం రూ.180 కోట్లు కేటాయించింది. ఇందులో ఫేజ్-1 కింద 487 పాఠశాలలను విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంతోపాటు రంగులు వేయడం కోసం ఎంపిక చేశారు. ఈ పాఠశాలలకు ఐదు మాసాల క్రితం కలర్లు కూడా తీసుకువచ్చి పాఠశాలల్లో అందుబాటులో ఉంచారు. కాని, ఉన్నతాధికారులు పనులను ఆపాలని ఆదేశాలు జారీ చేయడంతో ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. ఫేజ్-1 పనులకే దిక్కు లేదని.. ఇక ఫేజ్-2, ఫేజ్-3 పాఠశాలలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో సర్కారు బడులను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తయారుచేసి పాఠశాలలకు రంగులువేసి తీర్చిదిద్దాలని ప్రభుత్వం ముందుగా నిర్ణయించినా.. ఆ దిశగా పనులు జరగడంలేదు. జూన్ 1 నుంచి బడిబాట కార్యక్రమం ఉన్నందున అంతకు ముందే పాఠశాలలో వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది.

### మగ్గుతున్న రంగులు.. ఇవ్వని బిల్లులు

జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఫేజ్-1లో ఎంపిక చేసిన బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు వేసవి సెలవుల్లో పాఠశాలలకు రంగులు వేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం నిధులు కూడా కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా పనులు జరుగుతున్నప్పటికీ రంగారెడ్డిజిల్లాలో మాత్రం అధికారులు పనులు నిలిపివేశారు. ఎంపిక చేసిన పాఠశాలలకు రంగులు మార్చడం కోసం ఐదు నెలల క్రితం ఆయా పాఠశాలలకు తీసుకువచ్చారు. కలర్లు తీసుకువచ్చి కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేలోపే ఉన్నతాధికారుల నుంచి నిలిపివేయాలని ఆదేశాలొచ్చాయి. దీంతో ఈ సంవత్సరం కూడా అమ్మ ఆదర్శ పాఠశాలలు మొక్కుబడిగానే ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు - మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారుచేశారు. పాఠశాలల్లో తాగునీరు, బ్లాక్‌బోర్డులు, టేబుళ్లు, కుర్చీలు వంటి వసతులతోపాటు వంటగదుల నిర్మాణం, పాఠశాలలకు రంగులు మార్చడం వంటి పనులు చేపట్టారు. సర్కారు మారిన నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వలేమంటూ అధికారులు తెగేసి చెబుతున్నారు. దీంతో లక్షల రూపాయలు పెట్టి పనులు చేయించిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ప్రతిరోజూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

### పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తున్న సర్కారు



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన మన ఊరు - మన బడి కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడంతోపాటు కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పథకం పేరును అమ్మ ఆదర్శ పాఠశాలలుగా మార్చింది. కాని, వసతులపై దృష్టి సారించకపోవడం వలన ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయి. దీంతో పేద, మధ్యతరగతి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లాలంటే ఆసక్తి చూపడంలేదు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి హాజరు శాతం పెంచాలి.

- రాజ్‌కుమార్, విద్యార్థి సంఘం నాయకుడు



ఎన్‌జీటీ ఆర్డర్ కాపీని చూపిస్తున్న పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల -బీజాపూర్ జాతీయ రహదారి పనులపై

## సర్కారుకు చిత్తశుద్ధి లేదు

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి**

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 29 : కాంగ్రెస్ ప్రభుత్వానికి చేవెళ్ల-బీజాపూర్ జాతీయ రహదారి పనులను పూర్తి చేసి ప్రారంభించాలనే చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం చేవెళ్లలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల-బీజాపూర్ రోడ్డు పనులు క్యాన్సలై నెల రోజులవుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదన్నారు. రోడ్డు పనులు పూర్తి చేసి ప్రారంభించాలనే ఉద్దేశం సర్కారుకు లేనట్టు కనబడుతున్నదన్నారు. నేషనల్ హైవే అధికారులు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు దీనిపై అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అధికారులు ఎన్‌జీటీ కోర్టుకు తప్పుడు నివేదిక పంపించడంతో గత నెలలో ఎన్‌జీటీ కోర్టు రోడ్డు పనుల విస్తరణ నిలిపివేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిందని చెప్పారు. రోడ్డు పనులపై ఎమ్మెల్యే సబితారెడ్డి అసెంబ్లీలో ప్రశ్నించగా.. మంత్రి కోమటిరెడ్డి తప్పుడు సమాధానం ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా కోర్టు ఈఎస్ రిపోర్టు ఇవ్వాల్సిందిగా చెప్పడంతో.. రోడ్డు పనులు మొదటికి వచ్చాయన్నారు. దీనికి ఎమ్మెల్యే యాదయ్య, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బాధ్యత వహిస్తారా లేక ఇదే ప్రాంతం మీదుగా కొడంగల్ పోయే ముఖ్యమంత్రి వహిస్తారా అని ప్రశ్నించారు. దీంతోపాటు రోడ్డు ప్రమాదంలో ఎవరైనా చనిపోతే దీనికి ఎవరు బాధ్యులని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచి తాము పోరాటం చేయడంతోపాటు అధికారులకు వినతి పత్రాలు కూడా ఇస్తామని, అవసరమైతే ఢిల్లీకి పోయి మంత్రి నితిన్ గడ్కరీను కూడా కలుస్తామని తెలిపారు. ఈ విషయంలో ఎన్‌జీటీలో కూడా పిటిషన్ వేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు వెంకటేశ్, కృష్ణ, ఘనీ, సీనియర్ నాయకులు మాధవ్‌గౌడ్, విఘ్నేశ్‌గౌడ్, రాంప్రసాద్, నరేందర్‌రెడ్డి, శేఖర్, మహేందర్, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్యరెడ్డి ఉన్నారు.

## ఉద్యమకారులపై కక్ష సాధింపు చర్యలా..?

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్**



మోయిజ్‌ను అడిగి వివరాలు తెలుసుకుంటున్న శుభప్రద్‌పటేల్

యాలాల, ఏప్రిల్ 29 : తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా ముందుండి పోరాడిన ఉద్యమకారులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం అత్యంత హేయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. తాండూరులోని మాతా శిశు సంక్షేమ ఆసుపత్రి ఎదుట తెలంగాణ ఉద్యమకారుడు మోయిజ్ నడుపుతున్న టిఫిన్ సెంటర్‌ను అధికారులు మంగళవారం తొలగించారు. టిఫిన్ సెంటర్‌ను తొలగించడంతో మోయిజ్‌ను శుభప్రద్ పటేల్ కలిసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంసీహెచ్ ఎదుట అనేక డబ్బాలుండగా కేవలం మోయిజ్ డబ్బానే అధికారులు తొలగించడం సరైనది కాదన్నారు. అధికారులు అయిన వారికి ఆకుల్లో.. కానివారికి కంచాల్లో వడ్డించినట్లుగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌తో ఫోన్‌లో మాట్లాడి ఈ విషయంపై ఆరా తీశారు. ఉద్యమకారులపై కక్ష సాధింపు చర్యలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. పొట్ట కూటి కోసం టిఫిన్ సెంటర్ నడుపుకొనే వ్యక్తిపై దురుద్దేశపూర్వకంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. వెంటనే అధికారులు తొలగించిన డబ్బాను వెంటనే యథాస్థానంలో ఏర్పాటు చేయాలన్నారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు ముందుండి పోరాడుతామన్నారు. అవసరమైతే యాలాల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, భాను పాల్గొన్నారు.

## నాణ్యతకు తిలోదకాలు

- ఇష్టానుసారంగా రహదారి పక్కన సీసీతో గోడ నిర్మాణం
- ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ కరువు
- రెండు మూడేండ్లకే దెబ్బ తిన్న వైనం

పరిగి, ఏప్రిల్ 28 : ఏదైనా నిర్మాణ పని చేపట్టాలంటే సంబంధిత పర్యవేక్షణ చేపట్టే ఇంజినీరింగ్ అధికారులు దగ్గరుండి చేయించాల్సిందిపోయి, పనులు పూర్తయినా అటు వైపు వెళ్లకుండా, కేవలం కొలతలు స్వీకరించేందుకు తమ సహాయకులను పంపిస్తున్నారు. రికార్డులు చేస్తున్న తరుణంలో పనుల్లో నాణ్యతకు పూర్తిగా తిలోదకాలు ఇవ్వబడుతున్నాయని తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి చేపడుతున్న పనులు పది కాలాలపాటు ఉండాల్సిందిపోయి రెండు మూడు సంవత్సరాలకే దెబ్బతింటున్నాయి. రెండు నెలలకే వాటి నాణ్యతా లోపం బయటకు వస్తున్నది.

పరిగి పట్టణం నుంచి తుంకులగడ్డకు వెళ్లే రహదారిలో సీసీ వేశారు. కోతకు గురవకుండా సీసీ రోడ్డుకు పక్కనే సీసీతో గోడ నిర్మాణం చేపట్టారు. సీసీతో గోడను కనీసం ఒక అడుగు లోతు నుంచి నిర్మాణం చేపడితే బాగుండేది. కాగా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నిర్మాణం చేపట్టాడు. దానికి అధికారులు రికార్డు చేసి బిల్లు తయారు చేశారు. కానీ పని ఎంత పకడ్బందీగా చేశారన్నది వారు సరిగ్గా పరిశీలించలేదు. కొన్ని నెలల క్రితం కురిసిన వర్షానికి వచ్చిన వరద నీటితో ఏకంగా సీసీ గోడ కూలిపోయింది. సీసీ పని ఎంత నాణ్యతగా నిర్మించారో తెలుస్తున్నది.

ఇటీవల పరిగి మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో వేసిన సీసీ రోడ్డు రెండు నెలల్లోనే దుమ్ము లేస్తూ రోడ్డుకు ఇరువైపులా ఇళ్ల వారికి ఇబ్బందికరంగా మారింది. సీసీ రోడ్డు నిర్మాణంలో ఇసుకకు బదులుగా పిండి వంటి డస్ట్ వాడడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతున్నదని పేర్కొంటున్నారు. రోబో స్యాండ్ వాడినా ఇబ్బంది లేదు కానీ తక్కువ ధరకు వస్తుంది కదా అని పిండి వంటి డస్ట్‌ను వాడడంతో రోడ్డు నిర్మాణంలో నాణ్యత దెబ్బతింటున్నది. ఈ రోడ్డు విషయమై స్వయంగా మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం చూసేందుకు రాకపోవడం గమనార్హం.

### పర్సంటేజీలు అందితే చాలు..

సర్కారు నిధులతో పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత పర్యవేక్షణ చేసే ఇంజినీరింగ్ అధికారులు అక్కడ ఉండి పని నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలి. ఏ పని ఎలా చేయాలనేది పూర్తిస్థాయిలో సదరు కాంట్రాక్టర్‌కు తెలియజేయాలి. వారి సూచనల మేరకు పనులు జరగాలి. కానీ వారు పని జరిగే ప్రదేశం వైపు వెళ్లడం లేదనే విమర్శలున్నాయి. ప్రధానంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టే సమయంలో ఇంజినీరింగ్ అధికారులు కనీసం తొంగి చూడకుండా, పని పూర్తయిన తర్వాత ఎంబీ రికార్డు రాసేందుకు కేవలం కొలతలు తీసుకోవడానికి వెళ్తున్నారనే విమర్శలు బాహాటంగానే ఉన్నాయి. తమకు అందే పర్సంటేజీలు సక్రమంగా వస్తే చాలు.. పనులెలా ఉంటే తమకెందుకులే అనే విధంగా అధికారుల తీరు ఉంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టి పనులు నాణ్యతగా జరిగేలా చూడాలని, పనులను స్వయంగా అధికారులు పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చిన్నపాటి నీటి వరదకే కొట్టుకుపోయిన సీసీ గోడ

## మరోసారి భగ్గుమన్న విభేదాలు

- ఎమ్మెల్యే కాలె యాదయ్యపై చర్యలు తీసుకోవాలి
- నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు




ఎమ్మెల్యే యాదయ్యపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవాబుపేట, ఏప్రిల్ 29 : తమకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఫోన్ చేసి దుర్భాషలాడాడని.. ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీకే చెందిన నవాబుపేట మండల అధ్యక్షుడు వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు శేఖర్ వేర్వేరుగా మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మండలంలో నిర్వహించిన భూ భారతి కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో ఫోన్ చేసి ఎమ్మెల్యే మాట్లాడారన్నారు. 'మీ పదవులు పోతాయి.. గ్రూప్‌లో ఏమి పోస్టులు పెడుతున్నావ్ బిడ్డా..' అంటూ ఘాటుగా వార్నింగ్ ఇచ్చారన్నారు. 'మీ అంతు చూస్తా' అంటూ అసభ్య పదజాలంతో దూషించారన్నారు. ఎమ్మెల్యేతో ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. అసభ్యంగా మాట్లాడి అవమానపరిచిన ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినవారిలో సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, ఆనందం, సంగమేశ్, సదానంద్, లక్ష్మణ్, రాములు, మల్లేశం, గోపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు. ఇప్పటికే చేవెళ్ల కాంగ్రెస్ రెండు వర్గాల మధ్య విభేదాలు భగ్గుమంటుండగా.. ఈ సంఘటనతో అవి మరోసారి బయటపడ్డాయి.

# హామీ లేని ఉపాధి




**కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నది. గత నాలుగేండ్లుగా ఉపాధి హామీ పథకంలో గతంలో ఎన్నడూ లేని కొత్త విధానాలను తీసుకువచ్చింది. ప్రభుత్వ సంస్థలన్నింటినీ ప్రైవేట్‌పరం చేస్తూ వస్తున్నది మోదీ ప్రభుత్వం. కరువును అధిగమించడమే లక్ష్యంగా గత కొన్నేళ్లుగా నిరుపేదల కడుపు నింపేందుకు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకానికి మాత్రం తూట్లు పొడుస్తున్నది. జిల్లావ్యాప్తంగా 2,00,372 ఉపాధి హామీ కుటుంబాలుండగా, 4,38,398 మంది కూలీలున్నారు. ఉపాధి హామీ పనులనే నమ్ముకొని బతుకుతున్న కూలీలకు ఉపాధి హామీ పనులు దూరమయ్యాయి. పనులను భారీగా తగ్గించిన కేంద్రం వేల కుటుంబాల కడుపుకొడుతున్నది. దీంతో జిల్లాలో కూలీలు ఊర్లు వదిలి వలసలు పోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రం అమల్లోకి తీసుకువచ్చి ఎన్నో కుటుంబాలకు ఉపాధిని దూరం చేస్తున్న కొత్త నిబంధనలపై జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలందరూ మోదీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.**

- వికారాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ)

- ఉపాధి హామీ పథకంపై కేంద్రం కక్ష సాధింపు చర్యలు
- గత ఆర్థిక సంవత్సరం 61 లక్షల పనిదినాలు టార్గెట్ కాగా.. ఈ ఆర్థిక సంవత్సరం 33 లక్షలే లక్ష్యం
- గతేడాదితో పోలిస్తే 28 లక్షల పనిదినాలు తగ్గింపు
- నాలుగేండ్లలో 70 లక్షలకుపైగా కోత
- కేంద్రం అమలుచేస్తున్న కొత్త నిబంధనలతో ఆగమాగం
- లక్షల మంది పేద కూలీలకు దూరమవుతున్న ఉపాధి
- దిక్కులేక పొట్టకూటి కోసం వలసలు పోతున్న వైనం

పేద ప్రజలకు ఉపాధి హామీ పనులను దూరం చేసేలా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. లక్షల మంది కూలీల కడుపు నింపుతున్న ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నీరుగార్చేలా కేంద్రం అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగానే తప్పుడు నివేదికలు తెప్పించుకొని అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయంటూ ప్రచారం చేసి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. అందుకనుగుణంగానే గత నాలుగేండ్లుగా ఉపాధి హామీ పనిదినాలను భారీగా తగ్గిస్తున్నారు. కేవలం ఒక్క ఏడాదిలోనే 28 లక్షల పని దినాలను తగ్గిస్తూ నిర్ణయించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి 33 లక్షల పనిదినాలను మాత్రమే కల్పించాలని నిశ్చయించారు. గత నాలుగేండ్లలో 70 లక్షలకుపైగా పనిదినాలను జిల్లాలో తగ్గించారంటే ఉపాధి హామీ పథకంపై మోదీ ప్రభుత్వం ఏ స్థాయిలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదో అర్థం చేసుకోవచ్చు.

**పని దినాలు సంవత్సరాలవారీగా..**

| సంవత్సరం | పని దినాలు (లక్షల్లో) |
|---|---|
| 2021-22 | 103 |
| 2022-23 | 71.58 |
| 2023-24 | 62 |
| 2024-25 | 59.85 |
| 2025-26 | 33 |

### కొత్త సాఫ్ట్‌వేర్‌తో ఇబ్బందులు

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన ఎన్ఆర్ఈజీఎస్ సాఫ్ట్-ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌తో జిల్లాలోని లక్షల కుటుంబాలకు ఉపాధి హామీ పనులు దూరమయ్యాయి. కొత్త సాఫ్ట్‌వేర్ విధానంతో కూలీలు తప్పనిసరిగా ఉదయం, సాయంత్రం పనులకు తప్పనిసరిగా హాజరు కావాలని షరతులను విధించింది. కూలీలు చేస్తున్న పనులకు సంబంధించి ఉదయం 11 గంటలలోపు ఒక ఫొటో, సాయంత్రం 2 గంటల తర్వాత రెండో ఫొటో తప్పనిసరిగా తీయడంతోపాటు అప్‌లోడ్ చేస్తున్నారు. ఒక గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులకు సంబంధించి ఒక పని పూర్తైన తర్వాతనే మరొక పని చేపట్టాలని నిబంధన విధించారు. దీంతో గతంలో మాదిరిగా కాకుండా పనులు చాలా ఆలస్యమవుతున్నాయి. ప్రతిరోజూ చేపడుతున్న పనులను వెంటనే యాప్‌లో పొందుపర్చాలనే నిబంధనలతో క్షేత్రస్థాయిలో సిగ్నల్ లేకపోవడంతో అప్‌లోడ్ చేయడం ఇబ్బందిగా మారి పనుల్లో జాప్యం జరుగుతున్నది. నాలుగేండ్ల క్రితం 19,998 కుటుంబాలకు వంద రోజులపాటు పనులను కల్పించగా, గత ఆర్థిక సంవత్సరం కేవలం 3 వేల కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పనులను కల్పించారు.